

■ లోకల్ హీరో







గాంధీ నడికుడికార్

సినిమా ఇండస్ట్రీలో వెలిగిపోవాలంటే కలలు కంటే సరిపోదు. చీకట్లను దాటే నేర్పూ, కష్టాలకు తట్టుకునే ఓర్పుండాలి. అన్నప్రాశన నాడే ఆకలి బాధ తెలిసిన పాలమూరు బిడ్డకు ఈ గుణాలు జన్మతః వస్తాయేమో! ఆ మట్టి నేర్పిన మొండితనంతోనే హైదరాబాద్‌కు వలసొచ్చాడు **గాంధీ నడికుడికార్**. అన్నపూర్ణ స్టూడియో ముందు ఆకలి రాత్రులెన్నో గడిపాడు. కూలీగా పనిచేశాడు. సెట్ బాయ్‌గా కృషిచేశాడు. అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా అవకాశాలు చేజిక్కించుకున్నాడు. వెండి తెరపై 'ఆర్ట్ డైరెక్టర్... గాంధీ నడికుడికార్'గా ఎందరికో సుపరిచితుడయ్యాడు. ఆకలి రాజ్యంలో పుట్టి, పదిమంది ఆకలి తీరుస్తున్న గాంధీ ప్రస్థానం ఆయన మాటల్లో..

# పేదింటి కూలీ.. పెద్ద సినిమాల ప్రొడక్షన్ డిజైనర్

నేను

ఏడో తరగతి చదువుతున్నప్పుడు మా నాయిన పోయారు. ఆర్ ఎంపీ డాక్టరుగా పనిచేసిన మా నాయిన పెద్దగా సంపాదించలే. మా అమ్మ నన్ను చదివించలేకపోయింది. నాగర్ కర్నూల్ మా ఊరు. చదివించడం కోసం అదే ఊరిల ఉన్న బీసీ సాంఘిక సంక్షేమ హాస్టల్ల చేర్పిచ్చింది. నేను, తమ్ముడు హాస్టల్ల ఉండుకుంట జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ల చదివినం. నాకు సినిమాలంటె ఇష్టం. చిన్నప్పుడు నాగర్‌కర్నూల్ థియేటర్లకు వచ్చిన సినిమలన్నీ చూసేటోణ్ని. టికెట్ పైసలు మా పెద్దమ్మను అడుగుతుంటి. ఆమె కల్లు కాంపౌండ్ దగ్గర బజ్జీలు అమ్ముతుండేది. పెద్దమ్మకు పనిలో సాయపడేటోణ్ని. అడిగినప్పుడల్లా కాదనకుండ సినిమాకు డబ్బులిచ్చేది. నేను చిరంజీవి అభిమానిని. ఆయన సినిమాలకు బ్యానర్లు కట్టేటోడిని. పాటలకు డ్యాన్సులేసేటోడిని. పెద్దయినంక సిన్మాలల్ల ఏదో ఒక పని చేయాలనుకునేటోణ్ని.

## పాలమూరు పల్లె విడిచి

ముప్పై ఏండ్ల కింద.. పదో తరగతి పాసైన. ఇంటర్మీడియెట్ చదువుదామని ఉన్నా.. పైసల్లేవు! మా పాలమూరోళ్లందరి లెక్కనే వలసబాట పట్టిన. హైదరాబాద్ వచ్చిన. అన్నపూర్ణ స్టూడియోకు చేరిన. 'సినిమాలో ఏదో ఒక పని దొరుకుతుందిలే' అన్న ఆశతో స్టూడియో గేట్ ముందే నిలవడ్డ. వచ్చేటోళ్లు.. పోయేటోళ్లతో సంతలా అనిపించింది. ఎవరైనా ఆగితే ఏదైనా మాట్లాడుదం అనుకున్న! పొద్దుగుంకే దాకా ఎవరూ పట్టించుకోలే! స్టూడియో దగ్గర్ల ఓ చేతి పంపు ఉంది. ఆడ్నే నీళ్లు తాగి కడుపు నింపుకొన్న. స్టూడియో గేటు ఎదురుంగనే ఇసుకల పండుకున్న. తెల్లారింది. మల్ల వచ్చేటోళ్లు వస్తున్నరు. పోయేటోళ్లు పోతున్నరు. నన్నెవరూ పట్టించుకోలే! పొద్దెక్కుతుందనగా.. ఒకాయన నన్ను జూసి 'పని ఉంది. సెట్ బాయ్‌గా పనిచేస్తావా?' అన్నడు. ఎమ్మటే.. అన్నపూర్ణ స్టూడియోల అడుగుపెట్టిన. థర్డ్ ఫ్లోర్ మొత్తం శుభ్రం చేయమన్నడు. ఆ పని అయ్యే సరికి రాత్రి తొమ్మిదైంది. యాభై రూపాయలు ఇచ్చిండు. అదే నా మొదటి సంపాదన. ఒళ్లంత దుమ్ము.

